



ప్రత్యేక ఆకర్షణగా ఉన్న ఎద్దుల బండి



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో(ఎడమ నుంచి) ఎమ్మెల్యే జీఎంఆర్, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనరసింహ, జూపల్లి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కోదండరెడ్డి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, పర్ణికారెడ్డి, వంశీకృష్ణ



చేపల స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ



వివిధ రకాల పశువులను చూస్తున్న రైతులు

ప్రభుత్వం మీకోసమే..
పని చేస్తుంది

- పాలమూరులో సంక్రాంతికి ముందే రైతు పండగ
- ఆయిల్‌పామ్‌లో లాభాలిచ్చే బాధ్యత మాది
- పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌ను ఆశీర్వదించండి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ● ప్రారంభమైన మూడు రోజుల రైతు సదస్సు
- ఆకట్టుకుంటున్న స్టాళ్లు ● అధిక సంఖ్యలో తరలొచ్చిన రైతులు

మహబూబ్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 'మీరిచ్చిన అధికారాన్ని మీకోసమే వినియోగిస్తాం.. మీరు మెచ్చిన ప్రభుత్వం, మీరు కోరుకుని ఆశీర్వదించిన ప్రభుత్వం మీ కోసమే పని చేస్తుంది. బూర్గుల రామకృష్ణారావు తరువాత మళ్లీ పాలమూరు బిడ్డకు సీఎంగా అవకాశం రావడం మీ అదృష్టం. రాష్ట్ర కేబినెట్ ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. పాలమూరు అభివృద్ధి విషయంలో పది రూపాయలు ఎక్కువ ఖర్చు చేసినా అభ్యంతరం లేదని చెప్పాం. పాలమూరుకు ఇదివరకు ఉన్న పేరుపోవాలని పాలమూరు అంటే వలసల జిల్లా కాదు.. ఆ జిల్లాకే వలసలు వచ్చేలా చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు' అని అన్నారు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాపూర్ శివారులో మూడ్రోజులపాటు నిర్వహించనున్న రైతు పండగ సదస్సు గురువారం ప్రారంభమైంది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జిమధుసూదన్‌రెడ్డి ఈ పండగను ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ అప్పులున్నా, డబ్బులు లేకపోయినా ఏదోరకంగా రైతు కార్యక్రమాలన్నీ అమలు చేయాలన్న తాపత్రయం ఉన్న ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డితోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఎక్కువ ఆదాయం ఇచ్చే పంటలు ఉన్నాయని, ఆయిల్‌పామ్ సాగు చేస్తే మొదటి మూడేళ్ల పెట్టుబడి పెట్టే బాధ్యత తమదేనన్నారు. అందులో అంతర్ పంటలను సాగు చేస్తే వాటికి కూడా బోనస్ ఇస్తామని పేర్కొన్నారు. ఎవరికీ తలవంచని పంట పామ్‌ఆయిల్ అని, మీ బతుకుల్లో వెలుగులు నింపకపోతే వ్యవసాయశాఖ మంత్రిగా మీరు ఏ శిక్ష వేసినా సిద్ధంగా ఉంటానన్నారు. రాజకీయ నాయకులంతా రైతు బిడ్డలేనని, అధికారంలోకి వచ్చాక అన్నీ మరిచిపోతుంటామని

(మిగతా 6లో..)



పుంగనూరు జాతి దూడలతో..



రైతు సదస్సులోని ఓ స్టాల్ వద్ద సందర్శకుల తాకిడి

రైతును రాజుగా చేయాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం

రైతు పండగ స్టాల్స్ ప్రారంభోత్సవంలో మంత్రులు, ఎమ్మెల్యేలు 6

సేంద్రియ వ్యవసాయంతోనే లాభసాటి పంటలు

సదస్సులో పలువురు రైతుల మనోగతం 6

ఆకట్టుకున్న స్టాల్స్

సాగు పద్ధతులు, యంత్రాలు, ఆధునిక వ్యవసాయం, వంగడాలపై ఏర్పాటు 6



స్టాళ్ల వద్ద ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జీఎంఆర్



పాటలు పాడుతున్న కళాకారులు

కొల్లాపూర్‌లో కోలాహలం

- ఆర్ఐడీ స్వర్ణోత్సవాలకు హాజరైన సినీ హీరో విజయ్ దేవరకొండ, మంత్రి జూపల్లి, మైహోం అధినేత రామేశ్వర్‌రావు

కొల్లాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో కొనసాగుతున్న రాణి ఇందిరా దేవి (ఆర్ఐడీ) గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు రెండోరోజు నుంచి కోలాహలంగా సాగుతున్నది. గురువారం స్వర్ణోత్సవాలకు సినీ హీరో విజయ్ దేవరకొండ, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మైహోం అధినేత డాక్టర్ జూపల్లి రామేశ్వర్‌రావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్ఐడీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సాయిప్రసాద్ అధ్యక్షతన కొనసాగిన సభలో సినీహీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ... మా అమ్మ, బాబాయిలు ఆర్ఐడీ ఉన్నత పాఠశాలలో చదివారని అన్నారు. తమకు కొల్లాపూర్ ప్రాంతంతో..

మిగతా 7వ పేజీలో..



ఆర్ఐడీ పాఠశాలలో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విజయ్ దేవరకొండ మంత్రి జూపల్లి, మైహోం రామేశ్వరరావు

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన కూలీలు

బల్మూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడి పలువురికి గాయాలైన సంఘటన తుమ్మన్‌పేట సమీపంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలోని తుమ్మన్‌పేట గ్రామ సమీపంలో మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ఆటో బోల్తా పడింది. అందులో ఉన్న ఐదుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారని, మరికొంతమంది స్వల్పంగా గాయపడ్డారని తెలిపారు. వారిని అచ్చంపేట ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

చలిగాలుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లె శ్రీనివాసులు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వనపర్తి వైద్యవిభాగం, నవంబరు 28: చలి తీవ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, జీవనశైలిలో ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. ఇప్పటికే ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో మధుమేహంపై ఇంటింటి సర్వే చేయిస్తున్నాం. అందులో భాగంగానే చలికాలంలో వ్యాపించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. చలిగాలులతో వ్యాపించే శ్వాసకోశ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రతలపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లె శ్రీనివాసులు 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

చలికాలంలో ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయి..?

చలికాలంలో ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధులైన అస్తమా, నిమోనియా, అలర్జీలాంటి చర్మవ్యాధులు వ్యాపించే ఆస్కారం ఉంటుంది.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

చిన్నారులు, వయోవృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ బారిన పడి దగ్గు, జలుబు, ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారే ప్రమాదం ఉంటుంది. కాబట్టి అలాంటి వారు చలితీవ్రత అధికంగా ఉండే ప్రాంతాలలో వెచ్చగా ఉండే దుస్తులను ధరించి, సూర్యరశ్మి వచ్చిన తరువాతే బయటికి రావాలి.

ఏ సమయంలో వ్యాయామం చేయాలి..?

చలికాలంలో వ్యాయామం చేయడం వల్ల ఫిట్‌నెస్ పెరుగుతుంది. కానీ వయస్సు పైబడినవారు, వయోవృద్ధులు ఏడు గంటల తరువాత వ్యాయామం, వాకింగ్ చేస్తే బాగుంటుంది. యోగా చేసేవారు కూడా బయటి వాతావరణం చల్లగా ఉంటుంది. సాధ్యమైనంత వరకు ఇంట్లో చేసుకోవాలి.

వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారా..?

కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ ఆశా కార్యకర్త డోర్ టూ డోర్ విజిట్ చేస్తున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా మధుమేహంపై సర్వే కూడా చేస్తున్నారు. 30 సంవత్సరాలు పైబడిన వారు జిల్లాలో మూడు లక్షల మంది ఉన్నారు. వారందరికి మిషన్ మధుమేహం కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేసి చికిత్స చేసే కార్యక్రమం కొనసాగుతోంది. జలుబు, దగ్గు, జ్వరం బారిన పడ్డవారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేశాం.

చలికాలంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి..?

చలికాలంలో వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. ముఖ్యంగా టీ, కాఫీలు తక్కువగా తాగాలి. టీ, కాఫీలలో కెఫిన్ అనే ఆల్కలైడ్ పదార్థం ఉండటం వల్ల త్వరగా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఇప్పటి వరకు చలిగాలుల తీవ్రత వల్ల జిల్లాలో ఎలాంటి మరణాలూ సంభవించలేదు.

ధాన్యం మూడు మిల్లులకేనా?

- కార్యాలయంలో అధికారితో అసోసియేషన్ అధ్యక్షుడి వాగ్వాదం
- మామూళ్లు తీసుకొని ఇస్తున్నారంటూ ఆరోపణ
- చోద్యం చూస్తున్న జిల్లా అధికారులు
- అన్ని మిల్లులకు ఇస్తాం : డీఎస్‌వో స్వామికుమార్ 6



అనంతపురం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని బస్తాలకు నింపుతున్న కూలీలు

చదువులో రాణిస్తే ఉజ్వల భవిత

- కలెక్టర్ బదావత్ సంతోష్



తెలకపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

తెలకపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణిస్తేనే ఉజ్వల భవిత ఉంటుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. గురుకులానికి సరఫరా చేసే బియ్యాన్ని పరిశీలించి నాణ్యత లేకుంటే తిరిగి పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం పెంచాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. డేటా ఎంట్రీ చేసేటప్పుడు ఎన్యుమరేటర్ తప్పనిసరిగా దగ్గర ఉండి నమోదు చేయించాలని తెలిపారు. డేటా ఎంట్రీ పూర్తి చేశాక సర్వే పత్రాలను భద్రపర్చాలని ఎంపీడీవోను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ జాకీర్ అలీ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజనేయులు ఉన్నారు.

రెండు రోజుల్లోనే ధాన్యం డబ్బులు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు చేసిన ధాన్యా నికి సంబంధించిన డబ్బులు రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, పేమెంట్ల విషయంపై గురువారం కలెక్టరేట్‌లలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లపై పేమెంట్లు 90 శాతం పూర్తి కావాలని ఆదేశించారు. ఏపీఎంలను కొనుగోలు కేంద్రాలకు పంపి ప్రక్రియ వేగవంతం అయ్యేలా సూచనలు ఇవ్వాలని డీఆర్‌డీవోను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పేమెంట్లు ఆపే పరిస్థితి ప్రసక్తి లేదన్నారు. ఇప్పటి వరకు జిల్లా లో మొత్తం 46,722 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. 25,543 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.59.26 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. మిగతా పేమెంట్లు కూడా రెండు రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీవో ఉమాదేవి, డీసీవో ప్రసాదరావు, సివిల్ సప్లయ్ అధికారి కాశీవిశ్వనాథ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- నిఘా కోసం డ్రోన్ వ్యవస్థ ఏర్పాటు
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించేలా కృషి చేయాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నేరసమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రాపర్టీ నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. సరిహద్దు రాష్ట్రాలలో నేరాల గ్యాంగ్‌లకు సంబంధించిన ఇన్ఫర్మేషన్ సేకరించి ఆ దిశగా కేసుల ఛేదనపై దృష్టి సారించాలన్నారు. పోలీస్ స్టేషన్‌లకు కొత్త సిబ్బంది వస్తున్నందున బీట్ గస్తీల సంఖ్య పెంచి నేరాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఉండాలని, పనిచేయని వాటిని పునరుద్ధరించాలని సూచించారు. జిల్లాలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్‌కెమెరా ద్వారా నిఘా ఉంటుందని తెలిపారు. పగలు, రాత్రి, సమయాల్లో కూడా ఏ ప్రదేశాన్ని అయినా ఐదు కిలోమీటర్ల రేడియస్ వరకు, నేరుగా అయితే 15 కిలో మీటర్ల వరకు క్లియర్‌గా చూపించే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. అనంతరం డ్రోన్ పనితీరును ఎస్పీ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

సాధారణ బదిలీలు చేపట్టాలి

6

- సీఈ కార్యాలయంలో నేలపై కూర్చొని ఇంజనీర్ల నిరసన

ప్రభుత్వం మీకోసమే పని చేస్తుంది

(మొదటిపేజీ తరువాయి)
చెప్పారు. 30న జరిగే సీఎం రైతు సదస్సు ప్రతిపక్షాలకు కనువిప్పు కలగాలని, పాలమూరుకు సంక్రాంతికి ముందుగానే రైతుపండగ వచ్చిందని అన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి: మంత్రి దామోదర

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంభించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. 117 స్టాళ్లతో ఏర్పాటు చేసిన కార్యక్రమం పండగను తలపిస్తుందన్నారు. ఇంత మంచి కార్యక్రమం గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. 2004లో వ్యవసాయం దండగ అన్న భావన ఉండగా, అప్పుడు వ్యవసాయం దండగకాదు పండగ అన్న నినాదం కాంగ్రెస్ తీసుకుందన్నారు. కాంగ్రెస్ తరువాత వచ్చిన ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. మళ్లీ రేవంత్‌రెడ్డి వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిచ్చేలా ప్రణాళిక రూపొందించారన్నారు. ఆధునిక వంగడాలు, పద్ధతులపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు రైతలుకు అవగాహన కల్పించాలన్నారు.

క్లిష్ట పరిస్థితుల్లోనూ రైతులకిచ్చిన హామీల అమలు: మంత్రి జూపల్లి

ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చి ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు అప్పు చేశారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. రూ.60 వేల కోట్లు వడ్డీకే చెల్లించామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులున్నా ముఖ్యమంత్రి రైతులకిచ్చిన హామీలను అమలు చేస్తున్నారని తెలిపారు. రుణమాఫీతో పాటు సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నారని అన్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, లాభాలు సాధించే పంటలపై అవగాహన కల్పించేందుకే పెద్దఎత్తున స్టాళ్లను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి, సెరికల్చర్ డైరెక్టర్ యాష్మిన్‌భాష, ఎస్పీ జానకి, నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ఏర్పాట్లు భేష్: కలెక్టర్‌పై ప్రశంసలు

రాష్ట్ర స్థాయి సదస్సులో అన్ని రకాల ఏర్పాట్లను కలెక్టర్ విజయేందిర బోయి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఏర్పాట్లను పర్యవేక్షిస్తూనే ప్రజాప్రతినిధులు, రాష్ట్ర అధికారులను రిసీవ్ చేసుకోవడం, వారికి కావలసిన సమాచారం అందజేయడం, ప్రోగ్రామ్ షెడ్యూల్ డిజైన్ చేయడం వంటి పనుల్లో కలెక్టర్ బిజీబిజీగా గడిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా మొదటిరోజు సక్సెస్‌ఫుల్‌గా కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన రైతులు, అతిథులకు మంచి భోజన వసతి కల్పించారు. విశాలమైన ప్రాంతంలో ఎక్కువ ఫుడ్‌కౌంటర్లు ఏర్పాటుచేసి వచ్చిన వారు తోసుకోకుండా ప్రశాంతంగా భోజనం చేసే ఏర్పాట్లు చేయించారు. జనం కౌంటర్ల వద్ద గుమికూడకుండా కౌంటర్లు ఏర్పాటుచేయడం.. వడ్డించేందుకు ఎక్కువ మంది సిబ్బంది కేటాయించడంతో వచ్చిన వారు ఎక్కడా ఆగకుండా భోజనం చేసేలా చర్యలు తీసుకున్నారు.


మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మొక్క ఇస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి



రగడ్12(లోడర్) బైక్ రైతు నేస్తం

రగడ్12 బైక్ రైతు నేస్తం. ఆరు రూపాయలతో వందకిలోమీటర్ల ప్రయాణం చేయవచ్చు. లోడుతో 450కేజీల బరువు లోడుతో వంద కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చు. పిండిసంచులు, కూరగాయలు, వడ్లు, ఏమైన బరువులు పెట్టుకుని పొలం గట్లమీద ప్రయాణం చేయవచ్చు. కిరాణం వ్యాపారులు, పాల వ్యాపారులకు ఉపయోగం. రూ.లక్షా 35వేలు ధరతో రెండేళ్లక్రితమే మార్కెట్లోకి వచ్చింది. ఎల్ఈడీ సిస్టంలో ప్యానల్ చూపిస్తుంది. రైతులకు తక్కువ ధరతో అందిస్తే బాగుంటుంది.

- పెంటయ్య, రైతు, మరికల్

ఆకట్టుకున్న స్టాల్స్

వివిధ రకాల స్టాల్స్‌తో పాలమూరులో రైతులు సందడి చేశారు. కొన్ని స్టాల్స్ పలువురిని ఆలోచింపజేశాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ వద్ద అమిస్తాపూర్‌లో రైతు పండుగ పేరిట మూడు రోజుల సదస్సులో గురువారం ఈ స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. - పాలమూరు, ఆంధ్రజ్యోతి


మ్యాట్ మిషన్‌ను పరిశీలిస్తున్న రైతుతో పద్మహర్ష, డీడీఎం, హైదరాబాద్

మ్యాట్‌మిషన్ రైతుకు అన్యాయం చేయనివ్వొదు

రైతులు తీసుకువచ్చే ధాన్యంలో మట్టి, తాలు, రాళ్లు, రంగుమారటం, చాకు, పనికిరానిది, తేమ, పక్వానికి రానివాటిని పరీక్షించే మిషన్. ధాన్యం నాణ్యతను నిమిషంలో తెలుపుతుంది. రూ.15 ల క్షల విలువ చేసే యంత్రాన్ని ప్రతీ మార్కెట్ యార్డులో రైతులకు అందుబాటులో ఉంచాం. మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్లలో ఉంది. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ లక్ష్మణుడు, జాయింట్ డైరెక్టర్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర్ రాజు, డిప్యూటీ డైరెక్టర్ పద్మహర్ష, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు, డీఎం బాలమణి, కార్యదర్శి భాస్కర్, ఎస్ఈ లక్ష్మణ్‌గౌడ్ ఏర్పాట్లను పరిశీలించారు.

- జి.శివకుమార్, ఉత్తమ రైతు, ధన్వాడ



● **సోలార్ విద్యుత్‌తో ప్రజలకు అనేక లాభాలు**



సూర్యఘర్ పథకంతో ప్రతీ ఒక్కరు ఇంటిమీద సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఎం.ఎన్.ఆర్.ఈ పథకం ద్వారా ప్రజలకు సబ్సిడీ వస్తుంది. మూడు కిలోవాట్స్‌కు రూ.లక్షా 90వేలు (రూ.78 వేలు సబ్సిడీ), రెండు కిలోవాట్స్‌కు రూ.లక్షా 30వేలు (సబ్సిడీ రూ.60వేలు), ఒక కిలో వాట్స్‌కు రూ.80వేలు (రూ.30వేలు సబ్సిడీ) వస్తుంది. ఇప్పటికే అనేకమంది ఉత్సాహంతో సోలార్‌వైపు అడుగులు వేస్తున్నారు.

- అనీలా, టీజీ రెడ్‌కో ఎండీ, తెలంగాణ

● **క్రిషి3ప్రో డ్రోన్ పిచికారితో మందు చల్లటం తేలిక**



పొలంలో పురుగుమందు చల్లటం కోసం క్రిషి3 ప్రో డ్రోన్ రూ. 5లక్షలు జీఎస్టీ అదనం. ఒక ఎకరం ఆరు నిమిషాల్లో పురుగుమందులు చల్లుతుంది. పురుగుమందులు వృథా కాకుండా సగం మందులతోనే పొలానికి చల్లవచ్చు. ఇదేరోజు పొలమంతా మందు చల్లాల్సి ఉంటే ఒకేరోజు పొలమంతా చల్లవచ్చు. భవిష్యత్తులో ఫుడ్ డెలివరీకీ ఉపయోగపడుతుంది.

- ఏపీఎన్ రెడ్డి, కొండారెడ్డిపల్లి, కల్వకుర్తి


డ్రోన్ పిచికారిని చూపిస్తున్న కంపెనీ సిబ్బంది

రైతును రాజుగా చేయాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం

● **రైతు పండుగ వేడుకలను ప్రారంభించిన మంత్రులు, ఎమ్మెల్యేలు**

భూత్పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పద్ధతులతో రైతును రాజును చేసి దేశ చరిత్రలోనే రైతులు గొప్పస్థాయికి ఎదిగే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ గ్రామ శివారులో దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు పండుగ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు యన్నెం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, వంశీకృష్ణ, మేఘారెడ్డి, పర్ణికారెడ్డి, ఈర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ కూచకూళ్ల దామోదర్‌రెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు అయిన తరువాత రైతులను పట్టించుకున్న నాథుడే కరువయ్యారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రూ. 18 వేల కోట్లతో రైతు రుణ మాఫీ చేసిందన్నారు. అదే విధంగా రూ.50వేల కోట్లు రైతుల సంక్షేమ కోసం నిధులు ఖర్చు చేసిందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడారు.


రైతు పండుగ స్టాళ్లను రైతుతో ప్రారంభింపచేస్తున్న మంత్రులు రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రైతు పండుగను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్ల అప్పులు బాధలతో రైతులు అష్ట-కష్టాల పాలై అవస్థలు పడ్డారని అన్నారు. రైతులకు కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేశారన్నారు. అంతకు ముందు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ... ఇందిరాగాంధీ కాలం నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ముఖ్యంగా జూరాల, కోయిల్‌సాగర్, నాగార్జునసాగర్ శ్రీశైలం డ్యాంలను కట్టి రైతులకు సాగు నీటిని అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు.

16టీఎంసీలు ఉన్న జూరాల 6-7 టీఎంసీలకు చేరిందని.. పూడికతో నిండిపోయిందని, పూడిక తీయడానికి పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం పూడిక తీయడానికి కూడా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

భారత పశుసంరక్షణలో విప్లవం

పాలమూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామంలోని పాలమూరు జెనెటిక్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (పీజీఎస్)పశు సంరక్షణలో కొత్త శకం తెరవడానికి సిద్ధంగా ఉంది. ఈ సంస్థ అధునాతన ఇన్‌విట్రో ఫర్టిలైజేషన్(ఐవీఎఫ్), ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్(ఈటీ), సాంకేతికతల ద్వారా అత్యుత్తమ జనుల క్షణాలతో కూడిన ఆవులు, గేదెలను తయారు చేస్తోంది. వాటిని గురువారం రైతుసదస్సులో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్‌ను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదరం రాజనర సింహ, ఎస్‌వీఎస్ ఎండీ రాంరెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ఫారంలో గిర్ సాహివాల్, కంక్రేజ్, డి యోని, ఒంగోలు, పుంగనూరు, ముర్రా, జాఫ్రాబాది వంటి ప్రముఖ జాతుల స్వదేశీ, క్రాస్‌బ్రీడ్ జంతువులు ఉన్నాయి. రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీయం) కింద నిర్వహించే జాతి మెరుగుదల వేగవంతమైన కార్యక్రమం (ఏబీఐపీ) లో పాల్గొనే భారతదేశంలో ఏకైక ప్రైవేట్ సంస్థగా పీజీఎస్ నిలిచిందని అధికారులు వివరించారు. సొంత జంతువులను ఎంబ్రియోలో గర్భధారణ చేయడంతో రైతులు తమ గ్రామాల్లోనే అధిక పాలు ఇచ్చే జంతువులు పొందవచ్చన్నారు.

ఉత్పాదనలో ప్రసిద్ధి పొందిన హెచ్ఎఫ్/జెర్సీ ఆవుల తక్కువ సహన సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పీజీఎస్ భారత వాతావరణానికి తగిన కొత్త జాతుల అభివృద్ధిపై పని చేస్తోందన్నారు. బ్రెజిల్‌ను ఆదర్శంగా తీసుకుని 62.5శాతం, హెచ్ఎఫ్, 37.5 శాతం గిర్ జాతుల కలయికతో మరింత అనువైన జాతులు అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోందన్నారు. స్టాల్స్‌లో ఉత్తమ జాతుల ప్రదర్శన చేపట్టారు.


ఉత్తమ జాతుల పశువులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్‌వీఎస్ ఎండీ రాంరెడ్డి

సేంద్రియ వ్యవసాయంతోనే లాభసాటి పంటలు

సదస్సులో పలువురు రైతుల మనోగతం

మట్టితోనే ఎరువులు తయారు చేయొచ్చని, సేంద్రియ వ్యవసాయంతోనే లాభసాటి పంటలను సాగు చేయొచ్చని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. పూర్వీకులు పెంట ఎరువులతో ఎలా అయితే పంటలు పండించే వారో.. అదే విధంగా పంటలు సాగు చేస్తే లాభాలు వస్తాయని చెప్పారు. రైతు సదస్సుకు వచ్చిన రైతులు అనుభవాలనుపంచుకున్నారు..

● **మట్టితో ఎరువు తయారు చేయొచ్చు..**



సేంద్రియ వ్యవసాయంతోనే లాభసాటి పంటలను పండించుకోవచ్చు. మట్టితోనే ఎరువులు తయారు చేయవచ్చు. చాలా మంది రైతులు అనవసరంగా రసాయన ఎరువులు వాడి సారవంతమైన నేలలను నిస్సారవంతంగా తయారు చేసుకుంటున్నాం. రైతుల నూతన టెక్నాలజీలను పాతకాలం నాటి మన తాతలు, నాన్నలు వాడిన సాధారణ పెంట ఎరువులు వాడినందుకుగాను మంచి నాణ్యమైన పౌష్టికాహారం లభించింది. నేను గత 50 ఏళ్లుగా మట్టితో తయారు చేసిన సేంద్రియ ఎరువులను పంటల్లో వాడుతున్నాను.

- రైతు చింతల వెంకట్‌రెడ్డి

● **సంప్రదాయ వ్యవసాయమే మేలు**



మన పూర్వీకులు పాత కాలంలో ఏవిధంగా పెంట ఎరువులతో పంటలు పండించే వారో అదే మాదిరిగా నేను కూడా గత 2002 సంవత్సర కాలం నుంచి ఎటువటి రసాయన మందులు, ఎరువులు వాడకుండా వరి, పత్తి, ఆముదం, వేరుశనగ, మిర్చి, జొన్నలు, మొక్క జొన్నలు, ఆవాలు, మెంతులు, గోధుమలు వంటి పంటలను పండిస్తున్నాను. ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తున్నారు. మాకు 39 ఎకరాల పొలంలో చాలా కాలం నుంచి పాత పద్ధతుల్లో పంటలు పండిస్తున్నాం. మంచి లాభాలు వస్తున్నాయి.

- లావణ్య మహిళా రైతు, కార్వంగ గ్రామం, తెలకపల్లి

లాభసాటి వ్యవసాయం చేయవచ్చు

రైతులు ఆలోచించి నూత పద్ధతులను ఉపయోగించి మంచి లాభసాటి పంటలను పండించుకోవచ్చు. ఏ విధంగా అంటే మనమందరం సెల్ ఫోన్లు వాడుతున్నాం కదా అయితే ప్రతీ విషయాలు తెలుస్తున్నాయి. ఏప పంటలు వేస్తే బాగుంటుంది. ఎలాంటి భూముల్లో పంటలు బాగా పండుతాయి అనే విషయాలు మనకు సోషల్ మీడియా ద్వారా తెలిసిపోతుంది. చాలా మంది రైతులు అనవసరమైన ఎరువులు, మందులు వాడి పంటల దిగుబడులను తగ్గించుకుంటున్నారు. నేను చాలా కాలం నుంచి ఆధునిక వ్యవసాయ సాగు చేస్తున్నా. మంచి దిగుబడులు వస్తున్నాయి.



- శ్రీనివాస్‌రెడ్డి, రైతు, కొత్తకోట

సాధారణ బదిలీలు చేపట్టాలి

- సీఈ కార్యాలయంలో నేలపై కూర్చొని ఇంజనీర్ల నిరసన


ఈగలపెంట జెన్‌కో సీఈ కార్యాలయంలో నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఇంజనీర్లు

దోమలపెంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో సంస్థలో ఇంజనీర్లకు ప్రభుత్వం తక్షణమే సాధారణ బదిలీలు చేపట్టాలని శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రం (ఎస్ఎల్‌బీహెచ్ఈఎల్) బ్రాంచ్ ఇంజనీర్ల అసోసియేషన్ కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంజనీర్ల బదిలీలు చేపట్టాలని గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈగలపెంట సీఈ కార్యాలయంలో నేలపై కూర్చొని నిరసన వక్యం చేశారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి పది సంవత్సరాలు గడిచినా బదిలీలు జరగకపోవడంతో ఇంజనీర్లు ఆందోళనలో ఉన్నారని, సాధారణ బదిలీలు ప్రతి సంవత్సరం జరగాల్సిన బదిలీలను గత ప్రభుత్వం కాలయాపన చేసిందన్నారు. శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో గత కొన్ని సంవత్సరాల నుంచి తక్కువ మంది ఇంజనీర్లతో పని చేపిస్తూ అదనపు పని భారాన్ని జెన్‌కో యాజమాన్యం మోపుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని శాఖల మాదిరిగానే జెన్‌కోలో కూడా సాధారణ బదిలీలు జరుగుతాయని ఇంజనీర్లు ఎదురు చూసినా ఫలితం లేదన్నారు. జెన్‌కో అనుబంధ సంస్థలు అయిన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థలో బదిలీలు జరిగాయని, టీజీ జెన్‌కోలో ఆ పాలసీ ప్రవేశ పెట్టి బదిలీల ప్రక్రియ చేపడతామని యాజమాన్యం హామీ ఇచ్చింది.. ఎడునెలలు కావస్తున్నా ఉలుకూ పలుకూ లేదన్నారు. ఇప్పటి వరకు ముగ్గురు సీఎండీలు మారడం జెన్‌కోలో నూతన డైరెక్టర్లను నియమించక పోవడంతో బదిలీల ప్రక్రియలో పురోగతి లేక ఇంజనీర్లకు శాపంగా మారిందని పేర్కొన్నారు. ఇంజనీర్ల సాధారణ బదిలీలలు జరిగితే తప్పా ఖాళీల సంఖ్య తేలనుందని, దీంతో నిరుద్యోగులకు అవకాశం లభిస్తుందన్నారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎంపికైన నూతన ఇంజనీర్లకు అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు యాజమాన్యం సిద్ధమైంది.. అయినా బదిలీలు చేయకపోగా, కొందరికి రాజకీయ అండదండలతో జెన్‌కో అధికారులు బదిలీలు చేయడం తమను ఆందోళన కలిగిస్తుందని అసిస్టెంట్ ఇంజనీర్ల సంఘం కార్యదర్శి చరణ్ అన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే బదిలీల ప్రక్రియ చేపట్టాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడుతామని ఇంజనీర్ల సంఘం హెచ్చరించారు.

కార్యక్రమంలో అన్ని విభాగాల ఇంజనీర్లు పాల్గొన్నారు.

ధాన్యం మూడు మిల్లులకేనా

● **కార్యాలయంలో అధికారితో వాదనకు దిగిన అసోషియేషన్ అధ్యక్షుడు**
● **మామూళ్లు తీసుకొని ఇస్తున్నారంటూ ఆరోపణ**
● **చోద్యం చూస్తున్న జిల్లా అధికారులు**
● **అన్ని మిల్లులకు ధాన్యం ఇస్తాం : డీఎస్‌వో స్వామికుమార్**


జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రం

గద్వాల న్యూటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో మిల్లులకు ధాన్యం కేటాయింపుపై గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలోనే అధికారితో అసోషియేషన్ అధ్యక్షుడు వాగ్వాదానికి దిగారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని జిల్లాలో సామర్థ్యం చూపుతున్న మిల్లులకు ఇవ్వకుండా అధికారికి కావలసిన ఓ మూడు మిల్లులకు ఎందుకు ఇస్తున్నారని గొడవ జరిగినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి...

ధాన్యం కేటాయింపులో గోల్‌మాల్..

జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 70 రైస్ మిల్లులు ఉన్నాయి. ఇందులో ఆయా మిల్లుల సామర్థ్యాన్ని బట్టి 66 రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించవలసి ఉంటుంది. అయితే ఇందులో అధికారి సమన్వయం పాటించడంలేదని ఓ మూడు మిల్లులకే ఎక్కువ ధాన్యం కేటాయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా అధికారి ఆ మూడు రైస్ మిల్లులకు ఊరికే మాత్రం కాదు... ఒక్కో బస్తాకు రూ. 20 నుంచి రూ. 30 దాకా తీసుకొని ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్ఎన్ఆర్ ధాన్యానికి మార్కెట్‌లో చాలా డిమాండ్ ఉంది. రాజకీయ అండదండలు ఉన్న మూడు మిల్లులకు ఆర్ఎన్ఆర్ ధాన్యాన్ని అధికంగా కేటాయించినట్లు తెలుస్తోంది.

వానాకాలం సీజన్‌లో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని జిల్లా పౌరసరఫరా అధికారులు నిర్ణయించారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాల నుంచి 15వేల క్వింటాళ్లు సేకరించినట్లు అంచనా... అయితే ఇందులో ఆ ప్రాధాన మూడు మిల్లులకు అధికంగా ధాన్యం కేటాయిస్తున్నారు. వాటితో పాటు మరో ఐదు మిల్లులకు తూతూ మంత్రంగా ఇచ్చినట్లు రికార్డులో ఉన్నట్లు తెలుస్తుంది. ఆ మూడు మిల్లులకు ఇంకా ఎక్కువ సంఖ్యలో ఇచ్చిన తక్కువ సంఖ్యలోనే ఉన్నట్లు ఓపీఎంఎస్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. దీని ప్రకారమే రైతులకు ధాన్యం డబ్బులు ఇవ్వడం జరిగింది. అయితే ఆ మూడు మిల్లులు వేల సంఖ్యలో తీసుకొని ధాన్యాన్ని ఓపీఎంఎస్‌లో ఓకే చేస్తేనే రైతులకు పూర్తిస్థాయిలో డబ్బులు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అయితే ఓపీఎంఎస్‌లో ఇంకా వారు ఓకే చేయకపోవడంతోనే రైతులు తాము ఇచ్చిన ధాన్యం డబ్బులకు ఐకేపీల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయం స్పందించాల్సి ఉన్నది.

మూడు మిల్లులకే ధాన్యం కేటాయించడం సరికాదు

డీఎస్‌వో స్వామికుమార్ పక్షపాత ధోరణిలో ఆ మూడు మిల్లులకే ధాన్యం కేటాయించడం సరికాదు.. ఈ విషయంపై అధికారితో వాగ్వాదానికి దిగిన మాట వాస్తవమే.. అయితే అధికారి అన్ని మిల్లులకు సమానంగా కేటాయించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

- రామలింగ్గేశ్వర్ కామ్లే, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు

అన్ని మిల్లులకు సమానంగా కేటాయిస్తాం

సేకరించిన ధాన్యాన్ని బట్టి అన్ని మిల్లులకు పంపిణీ చేస్తాం. ఇప్పటికే కొన్ని మిల్లులకు కొంత ధాన్యాన్ని పంపించాము.

ఇందులో మిల్లుల సామర్థ్యాన్ని బట్టి కేటాయిస్తున్నాము. ఎవరితో ముడుపులు తీసుకోలేదు. త్వరలోనే అందరికి ధాన్యం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటాం.

- స్వామికుమార్, డీఎస్‌వో

ఉమ్మడి జిల్లా ఆర్టీసీ ఆర్ఎంగా సంతోష్ కుమార్

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా పి.సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. రంగారెడ్డి రీజియన్ డిప్యూటీ ఆర్ఎంగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై మహబూబ్‌నగర్ ఆర్ఎంగా బదిలీ అయ్యారు. ప్ర స్తుతం ఇక్కడ ఆర్ఎంగా పని చేస్తున్న శ్రీదేవి హైదరాబాద్ ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఐటీ విభాగంలో చీఫ్ ఇంజనీర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం బదిలీ ఉత్తర్వులు అందాయి. ఆర్ఎంగా పదోన్నతిపై బదిలీ అయిన సంతోష్ కుమార్ అమావాస్య తరువాత విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.

ఆర్టీసీ ఈడీకి అభినందనలు


ఈడీ వినోద్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆర్టీసీ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ మహబూబ్‌నగర్ విచ్చేసిన సందర్భంగా గురువారం స్థానిక ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఛాంబర్‌లో కలిసి పలువురు ఉద్యోగులు అభినందనలు తెలిపారు. సీఐ రాంజీ, ఎం.విజయబాబు, కుర్మయ్య, వెల్ఫేర్ బోర్డు కమిటీ మెంబర్ ఆంజనేయులు ఉన్నారు.

అభయుడి ఆలయ ఆదాయం రూ.43.51 లక్షలు

ఊర్కొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆదాయం రూ.43.51 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి తెలిపారు. ఆలయం ఆవరణలో 2025 సంవత్సరానికి కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర, పూజ సామగ్రి విక్రయించేందుకు గురువారం టెండర్లు నిర్వహించగా 43 లక్షల 51 ఆదాయం వచ్చిందని అన్నారు. తలనీలాలు, కొబ్బరి చిప్పల నిమిత్తం నిర్వహించిన టెండర్లలో ఎవరు పాల్గొనకపోవడంతో వాయిదా వేశామని, వాయిదా వేసిన టెండర్లను తదుపరి తేదీలను ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధరి, ఆలయ అధికారులు మారుతిరావు, వరలక్ష్మీ, మాజీ చైర్మన్ నర్సిరెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, అశోక్, అరవింద్‌గౌడ్, యాదగిరి, రమేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

స్పోర్ట్స్ బాక్స్

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

» కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ డీకే స్నిగ్ధారెడ్డి



కబడ్డీ పోటీలను తిలకిస్తున్న స్నిగ్ధారెడ్డి, నాయకులు

గద్వాల అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో క్రమశిక్షణతో రాణిస్తే, ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కబడ్డీ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ జిల్లా చైర్మన్ డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సోమనాద్రి మినీ స్టేడియంలో గురువారం నిర్వహించిన సీనియర్ మహిళల కబడ్డీ జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ క్రీడ అయిన కబడ్డీకి ప్రస్తుతం మంచి ఆదరణ లభిస్తోందన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు క్రీడా రంగంలోనూ ప్రతిభ చాటడం సంతోషకరమన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమంగా రాణించి జిల్లా క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటాలన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారిణులు హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో వచ్చేనెల ఏడు నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ బండల పద్మావతి, తపాల కృష్ణవేణి, కన్వీనర్ అబ్రహం, కబడ్డీ నరసింహ, ఫిజికల్ డైరెక్టర్ నాగేష్, పీఈటీ రాధ, చందు, సరాయి బాషా (జిమ్), రఘు, మంజునాథ్, బుజ్జి, సర్వేష్ రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అల్లీపూర్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు గణేశ్, అశ్విని, అక్షయ, సింధూజ, సుచిత్ర

చిన్నచింతకుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అల్లీపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న వనపర్తిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అశ్విని 50 మీటర్లు, అక్షయ 300 మీటర్లు, సింధూజ 100 మీటర్ల పరుగు పందెం, సుచిత్ర బ్రాడ్‌జంప్, గణేశ్, జావెలిన్‌త్రో విభాగాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానం దక్కించు కున్నారు. వచ్చేనెల ఒకటి నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్ చాంపియన్ పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం ఐదుగురు విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్, అభినందించారు.

హాకీలో పెద్దమందడి విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శివశంకర్, రేవతి, అంజిలతో ప్రధానోపాధ్యాయుడు శాంతన్న, పీడీ మన్యం యాదవ్

పెద్దమందడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి అండర్-14 బాలుర, బాలికల జట్ల ఎంపిక పోటీల్లో పెద్దమందడి పెద్దమందడి విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. ఏడవ తరగతి విద్యార్థులు ఆర్.రేవతి, ఆర్.అంజి, తొమ్మిదవ తరగతి విద్యార్థి శివశంకర్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శాంతన్న, ఫిజికల్ డైరెక్టర్ మన్యం యాదవ్ వారిని అభినందించారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల ఒకటవ తేదీ వరకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు.

క్రైం కార్నర్

చెరుకుతోటకు నిప్పు



కాలిపోయిన చెరుకు తోట

మాగనూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ మండలం అనుగొండ గ్రామ పంచాయతీ పరిధిలో, మాజీ సర్పంచ్ గడ్డం రమేశ్‌కు చెందిన ఆరు ఎకరాల చెరుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో పంట పూర్తిగా కాలిపోయి మూడు లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జడ్చర్ల ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్ మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎండీ ఖాజా (37), భార్య ఫర్హానాబేగంతో కలిసి బతుకుదెరువు కోసం ఆరేళ్ల క్రితం కావేరమ్మ పేటకు వచ్చారు. అలాగే ఈనెల 19న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన ఖాజా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో గురువారం కావేరమ్మపేట పశువుల సంత సమీపంలోని చెట్టుకు ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో జడ్చర్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అతడిని ఎండీ ఖాజాగా గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అతడి సోదరుడు మహ్మద్ షాబుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

కల్వకుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో ఓ వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండలం, కోమటికుంట గ్రామానికి చెందిన జి.నాగేషు గతంలో దొంగతనానికి పాల్పడటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని గురువారం కల్వకుర్తి కోర్టులో ప్రవేశపెట్టగా, నెల రోజుల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి కావ్య తీర్పు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కోస్గి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. నారాయణపేట జిల్లా కోస్గీ మండలంలోని లోదీపూర్ గ్రామానికి చెందిన చెన్నయ్య (52) గురువారం తన పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ మేరకు అతడి భార్య భగవతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు.



ఆర్‌ఐడీ విద్యా సంస్థల స్వర్ణోత్సవానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు, హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

కలిసి.. మురిసి..

నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ పట్టణంలో రాణి ఇందిరాదేవి (ఆర్‌ఐడీ) విద్యాసంస్థల స్వర్ణోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఆర్‌ఐడీ పాఠశాల, కళాశాలల్లో విద్యాభ్యాసం చేసిన పలువురు ప్రస్తుతం రాష్ట్ర స్థాయి ప్రముఖులుగా, ప్రజాప్రతినిధులుగా, రాజకీయ నాయకులుగా, విద్యావేత్తలుగా, సామాజికవేత్తలుగా, ఉన్నతోద్యోగులుగా దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. స్వర్ణోత్సవాలకు వారందరూ తరలివచ్చారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. యోగ క్షేమాలను తెలుసుకున్నారు. అలనాటి మధురస్మృతులను యాది చేసుకొని మురిసిపోయారు. అప్పుడు పాఠాలు చెప్పిన గురువులను సత్కరించుకున్నారు. అందరూ కలిసి ఆనందంగా గడుపుతున్నారు. వారిలో కొందరిని 'ఆంధ్రజ్యోతి' గురువారం పలుకరించింది. వారి మనోభిప్రాయాలను సేకరించింది. భవిష్యత్తులో వారు చేపట్టబోయే కార్యక్రమాలను తెలుసుకున్నది. వివరాలు వారి మాటల్లోనే...

- కొల్లాపూర్, (ఆంధ్రజ్యోతి)


విద్యార్థులకు అండగా ఉంటాం



కొల్లాపూర్ నియోజకవర్గ విద్యార్థులకు అండగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును అందిస్తాం. దేశవ్యాప్తంగా ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు పొందేలా వారికి అవగాహన కల్పిస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ విద్యాబోధన సాగేలా కృషి చేస్తాం. పదవ తరగతి తరువాత ఉండే మంచి కోర్సులపై అవగాహన కల్పిస్తాం. ఉన్నత స్థాయికి ఎదిగేలా సూచనలు ఇస్తాం. ఆర్‌ఐడీ గోల్డెన్ జూబ్లీ స్వర్ణోత్సవాల్లో పాల్గొనడం వల్ల ఆ నాటి తీపి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి.

- ప్రొఫెసర్ వలిపే రామ్‌గోపాల్ రావు, ఢిల్లీ ఐఐటీ

చిన్న బడిలో చదివి విజయం సాధించాం



కొల్లాపూర్‌లో ఉన్న ఆర్‌ఐడి ఉన్నత పాఠశాలలో చదివి సక్సెస్ సాధించిన వాళ్లం ఎంతో మంది ఉన్నాం. పూర్వ విద్యార్థుల సక్సెస్ స్టోరీలను నేటి విద్యార్థులకు తెలియపరుస్తాం. ఆర్‌ఐడి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 50 సంవత్సరాల తరువాత నిర్వహించడం పూర్వ విద్యార్థులను, మిత్రులను ఉపాధ్యాయులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు చదివించే లక్ష్యంతో ఆర్‌ఐడి అల్యూమ్ని పని చేయబోతుంది.

- ప్రొఫెసర్ జయరాంరెడ్డి, ఢిల్లీ బిట్స్ పిలానీ.

ఎంతో సంతోషంగా ఉంది



ఆర్‌ఐడీ జూనియర్ కళాశాలలో మా నాన్న లెక్చరర్‌గా పని చేశారు. 75 సంవత్సరాల తరువాత ఆర్‌ఐడీ పాఠశాల, 50 సంవత్సరాల తరువాత కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ ఒకే వేదికపై కలుసుకోవడం తెలంగాణలో ఇదే తొలిసారి. కొల్లాపూర్ ప్రాంతం విద్యాపరంగా ఎప్పటినుంచో అభివృద్ధి చెందింది. ఈ ప్రాంత వాసులు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. వారంతా ఈ రోజు కొల్లాపూర్ ప్రాంత అభివృద్ధికి ముందుకు రావడం ఈ ప్రాంత విద్యార్థుల అదృష్టం.

- డాక్టర్ భానుచంద్ర, ఉస్మానియా హాస్పిటల్, హైదరాబాద్

మనసుకు తృప్తినిచ్చింది



ఆర్‌ఐడీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. చిన్ననాటి నుంచి కలిసి చదువుకున్న వారంతా ఎన్నో ఏళ్ల తర్వాత తిరిగి కలవడం మనసుకెంతో సంతృప్తినిచ్చింది. అప్పుడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను కలుసుకున్నాం. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నాం. ఆర్‌ఐడీ స్వర్ణోత్సవాలు ఇంత ఘనంగా జరగడం ఎప్పటికీ మర్చిపోలేం. మిత్రులను కలుసుకోవడం చాలా బాగుంది.

- సరోజ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, హైదరాబాద్

నేటి విద్యార్థులకు ఉన్నత అవకాశాలు కల్పిస్తాం



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉన్నత అవకాశాలు కల్పించేలా ఆర్‌ఐడీ అల్యూమ్ని ఏర్పాటు కావడం ఎంతో గర్వంగా ఉంది. ఆర్‌ఐడీ ఉన్నత పాఠశాలలో చదివిన రోజులు, ఆ నాటి జ్ఞాపకాలను తిరిగి గుర్తు చేసుకునేలా గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉంది. ఎంతో మంది పూర్వ విద్యార్థులను, ఉపాధ్యాయులను కలుసుకున్నాం.

- రేవతి, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు

చాలా కాలం తరువాత మిత్రులను కలిశా



చాలా కాలం తరువాత చిన్న నాటి మిత్రులను, ఉపాధ్యాయులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. చిన్ననాటి చిలిపి చేష్టలు, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాం. ఎక్కడెక్కడో స్థిరపడిన స్నేహితులతో మాట్లాడుకునే అవకాశం స్వర్ణోత్సవాలతో లభించింది. ఆర్‌ఐడీ జూనియర్ కళాశాలలో గడిపిన ఆ నాటి రోజులను తలుచుకోవడం మధురానుభూతిని కలిగించింది.

- ఎస్. నరసింహారావు, కొల్లాపూర్



పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి

కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రం గతంలో ఉన్న వైభవం తిరిగి తెచ్చేలా ఆర్‌ఐడి అల్యూమ్ని కృషి చేస్తుంది. అందులో భాగంగానే గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాం. నాడు కొల్లాపూర్ పూర్వ విద్యార్థులు చదువుల్లో, ఆటల పోటీల్లో ఎంతో ముందుండేవారు. అలాంటి వైభవాన్ని నేటి బాలలకు అందించేందుకు అల్యూమ్ని కృషి చేస్తుంది. ఆనాటి తీపి జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయి. పేద పిల్లలకు ఉన్నత చదువులు అందించే లక్ష్యంగా పని చేస్తున్నాం.

- జగదీశ్, సీఐ, సైబరాబాద్.



నెంబర్ వన్ స్థాయికి తీసుకెళ్తాం

కొల్లాపూర్ ప్రాంతాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తీసుకువెళ్లేలా నాంది పడింది. ఒకప్పుడు ఆర్‌ఐడి ఉన్నత పాఠశాలలో చదివిన వారంతా దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారు. కొల్లాపూర్ పిల్లలకు ఎంతైనా చేయాలనే ఉద్దేశ్యంతో ఆర్‌ఐడి అల్యూమ్ని ఏర్పడింది. ఇది ప్రారంభం మాత్రమే, 2050 సంవత్సరం లోపు కొల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న ప్రతీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తాం. ఇలా పూర్వ విద్యార్థులను తిరిగి కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.

- జూపల్లి జగన్మోహన్ రావు, రిటైర్డ్ ట్రాన్స్‌కో ఉద్యోగి.



నా వంతు సహకారం అందిస్తా

ఆ నాటి స్నేహితులను 50 సంవత్సరాల తరువాత తిరిగి కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. నేను కొల్లాపూర్ ప్రాంత వాసిని. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేశాను. నేడు ఆర్‌ఐడీ అల్యూమ్ని ఏర్పడటం ఎంతో గర్వంగా ఉంది. చదివిన పాఠశాలను తిరిగి చూడడం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. కొల్లాపూర్ ప్రాంత విద్యార్థులకు నా వంతు సహకారం అందిస్తాను.

- జి. రామకృష్ణ, రిటైర్డ్ ప్రొఫెసర్, ఉస్మానియా యూనివర్సిటీ

కొల్లాపూర్‌లో కోలాహలం

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. కొల్లాపూర్ అందాలు, కొల్లాపూర్ బలం చూశానని ఇక్కడి ప్రజల ప్రేమ ఆప్యాయత చూసి తనకెంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులంతా కష్టపడి చదివి భవిష్యత్తులో రాణించాలని అన్నారు. అనంతరం పట్టణంలో మరమ్మతులు చేసిన ఆర్‌ఐడీ పాఠశాల భవనాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, విజయ్ దేవరకొండతో కలిసి ప్రారంభించారు. అక్కడి నుంచి పట్టణంలోని రాజా బంగ్లాలో కొనసాగుతున్న స్వర్ణోత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సినీ హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది రైతు పండించిన పంటలు చేతికి రాగానే సింగోటం లక్ష్మీ నరసింహస్వామికి మొక్కులు సమర్పించే జ్ఞాపకాలు తనకు గుర్తు ఉన్నాయని అన్నారు. ఇక నుంచి కొల్లాపూర్ వస్తుంటానని, ఆర్‌ఐడీ పాఠశాల నుంచి 14 మంది వివిధ విభాగాలలో వైస్ ఛాన్సలర్స్‌గా ఎదగడం ఈ పాఠశాల గొప్పతనమన్నారు. ఆర్‌ఐడీ పాఠశాలలో చదివిన మై హోమ్ గ్రూప్స్ చైర్మన్ రామేశ్వర్‌రావు ఎంతో ఖ్యాతి గడించారని, పారిశ్రామిక వేత్తగా గుర్తింపు సాధించారని అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో తిరుపాలు, వెంకటదాసు రచించి పాడిన పాటల సీడీని, ఆర్‌ఐడీ 2050 విజన్ ఏవీలను ఆవిష్కరించారు. అంతకు ముందు విజయ్ దేవరకొండను సత్కరించి జ్ఞాపికను అందించారు. 95 ఏళ్ల పూర్వ విద్యార్థులతో కలిసి ఆర్‌ఐడీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించడంతో వండర్ వరల్డ్ ఆఫ్ రికార్డు ప్రతినిధి బృందం ధ్రువీకరణ పత్రాన్ని, షీల్డ్‌ను విజయ్ దేవరకొండకు అందజేశారు.



స్వర్ణోత్సవాల్లో కళాకారులతో కలిసి దప్పు వాయిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణ హీరో, పాలమూరు ఐకాన్‌గా హీరో విజయ్ దేవరకొండ ఉండడం గర్వంగా ఉందన్నారు. 96 ఏళ్ల నాటి నుంచి పూర్వ విద్యార్థులను ఏకం చేసి ఈ ప్రాంతంలో స్వర్ణోత్సవాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తామన్నారు. అదే విధంగా మై హోమ్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి, భవిష్యత్ తరానికి మంచి బాటలు వేసేలా పెద్ద కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గ విద్యార్థులకు మంచి భవిష్యత్ అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆర్‌ఐడీ పూర్వ విద్యార్థులతో కలిసి సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్‌రావు, ఢిల్లీ బిట్స్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రామ్‌గోపాల్‌రావ్, ప్రొఫెసర్ జయరాంరెడ్డి, ప్రొఫెసర్లు, పూర్వ విద్యార్థులు, వాగ్గేయకారుడు అందెశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గురుకులం నుంచి పారిపోయిన విద్యార్థులు

» ఆంధ్రప్రదేశ్‌లోని నర్సరావుపేట రైల్వే స్టేషన్లో ఆచూకీ లభ్యం

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల నుంచి ఈ నెల 26న ఇద్దరు విద్యార్థులు పారిపోయారు. ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఇద్దరు విద్యార్థులు ఈ నెల 26న రాత్రి గురుకుల వసతి గృహం నుంచి తప్పించుకొని రైలు ఎక్కి ఆంధ్రప్రదేశ్‌లోని నర్సరావుపేట రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లో వీరిని చూసిన రైల్వే పోలీసులు, చైల్డ్‌లైన్ సిబ్బంది సహకారంతో వారిని విచారించారు.

తాము మహబూబ్‌నగర్ గురుకుల పాఠశాల విద్యార్థులమని వారు తెలిపారు. దీంతో వారు మహబూబ్‌నగర్ ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడి చైల్డ్ సిబ్బంది విద్యార్థులతో బయలు దేరారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్‌కు చేరుకోనున్నారు. అనంతరం విద్యార్థులను గురుకుల పాఠశాలకు అప్పగించనున్నారు. అయితే గురుకుల పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు పారిపోయినా సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం, కనీసం ఉన్నతాధికారులకు కూడా చెప్పకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పోలీసు బందోబస్తు మధ్య

గురుకుల విద్యార్థి అంత్యక్రియలు

మదనాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి అంత్యక్రియలు గురువారం పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. మండలంలోని కొన్నూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు, సత్యమ్మ దంపతులకు రెండవ కుమారుడైన ప్రవీణ్‌కుమార్ (12) గురుకుల పాఠశాల హాస్టల్ గదిలో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. బాలుడి మృతదేహానికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి గొడవలూ జరగకుండా సీఐ శంకర్‌తో పాటు కొత్తకోట, మదనాపురం ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వారానికి ఐదు రోజులు పత్తి విత్తనాల వేలం

పాలమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వారానికి ఐదు రోజులు పత్తి విత్తనాలకు ఈ-వేలం నిర్వహిస్తున్నట్లు ది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజర్ కె.మహేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ నుంచి పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలనుకున్న రైతులు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. విత్తనాల కొనుగోలుకు సంబంధించిన నిబంధనలు, షరతులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. రిజిస్ట్రేషన్‌లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే మహబూబ్‌నగర్ పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని సీసీఐ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అయినా సమస్య పరిష్కారం కాకపోతే 77189 55728 నెంబర్‌కు సందేశం పంపొచ్చని వివరించారు.

ఇంటర్వ్యూ..

అనుమతి లేనిది ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లొద్దు

- విద్యుత్ శాఖ ఏఈ శ్రీరాములు



తాడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో ఎవరైనా సరే విద్యుత్ శాఖ అధికారుల అనుమతి లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లి సమస్యలు కొని తెచ్చుకోవద్దని విద్యుత్ శాఖ ఏఈ శ్రీరాములు అన్నారు. గృహజ్యోతి దరఖాస్తులు, ఇతర విషయాలపై 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

గ్రామీణ ప్రాంతాల్లో జరిగే విద్యుత్ ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి ?

గ్రామీణ ప్రాంతాలలో తరచూ ఎక్కడో ఓ దగ్గర విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్న మాట వాస్తవమే. గ్రామీణ ప్రజలు విద్యుత్ శాఖ అధికారుల అనుమతి లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకూడదు. ఒకవేళ ఏమైనా సమస్యలు వస్తే స్థానికంగా ఉండే జూనియర్ లైన్‌మన్, లైన్‌మెన్ల దృష్టికి తీసుకెళ్లితే సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు. సొంత నిర్ణయాలు తీసుకుని ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దు

గృహజ్యోతి కింద ఎన్ని జీరో బిల్లులు వచ్చాయి?

మండల కేంద్రంతో పాటు మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో 6,400కు పైగా గృహాలకు సంబంధించిన సర్వీసులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 4,500 కనెక్షన్లకు జీరో బిల్లులు వస్తున్నాయి. మిగిలిన కనెక్షన్లు జీరో బిల్లులు రావాలంటే సంబంధిత సర్వీస్ హోల్డర్ ఎంపీడీవో కార్యాలయం లో అవసరమైన కాగితాలు సమర్పిస్తే జీరో బిల్లులు వస్తాయి. అగ్రికల్చర్ సర్వీస్‌లకు సంబంధించి మండల వ్యాప్తంగా 150 మంది రైతులు నూతన కనెక్షన్ల కోసం డీడీలు చెల్లించారు. వీరందరికీ మరికొద్ది రోజుల్లోనే సామగ్రి అందించడంతో పాటు నూతన కనెక్షన్లను పునరుద్ధరిస్తాం.

లూజ్ లైన్లను ఎలా నియంత్రిస్తారు. గృహ కనెక్షన్ పొందాలంటే ఎవరిని సంప్రదించాలి?

గ్రామాలలో లూజు లైన్ల సమస్య చాలా ప్రాంతాల్లో ఉంది. ఆ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వానికి ఎస్టిమేషన్లు పంపించాం. రాగానే సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం. రోడ్డు క్రాసింగ్‌ల వద్ద ఎక్కడైనా సమస్య ఉంటే మా దృష్టికి తీసుకొస్తే ఆ సమస్యను పరిష్కరిస్తాం. ఇంటికి సంబంధించిన నూతన విద్యుత్ కనెక్షన్ కావాల్సిన వారు స్థానికంగా ఉండే జూనియర్ లైన్‌మన్‌ను సంప్రదించి మీ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు అందజేస్తే నూతన కనెక్షన్ ఇస్తాము.

క్రైం కార్నర్

చోరీ కేసులో నెల జైలు శిక్ష

కల్వకుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో ఒకరికి నెల రోజులు జైలు శిక్షను న్యాయాధికారి విధించినట్లు కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. లింగాల మండలం కోమటికుంట గ్రామానికి చెందిన జి.నాగేశ్ గతంలో దొంగతనానికి పాల్పడ్డాడని, దీంతో చోరీ కేసు నమోదైంది. గురువారం కోర్టులో న్యాయాధికారి కావ్య నెల రోజు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమా నా విధించారని ఎస్ఐ తెలిపారు.

అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం



పరిశీలిస్తున్న తహసీల్దార్ శైలేంద్ర కుమార్

మన్ననూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం తుర్కపల్లి గ్రామంలో ఆకస్మికంగా రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుంద సుదర్శన్, కుంద వెంకటేష్ లకు చెందిన రెండు పూరిళ్లలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇంటి యజమానులు స్థానికంగా లేకపోవడంతో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లగా గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో గ్రామస్థులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న వస్తువులు అగ్నికి కాలిపోయాయి. తహసీల్దార్ శైలేంద్ర కుమార్ అక్కడికి వెళ్లి గ్రామస్థుల సమక్షంలో పంచనామా నిర్వహించారు.

ప్రమాదవశాత్తు ఆవు మృతి

ఉప్పునుంతల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఉప్పునుంతలకు చెందిన మధునాగుల శ్రీశైలం గురువారం తన వ్యవసాయ పొలంలో మేత మేసేందుకు పత్తి చేనులో జెర్సీ ఆవును కట్టేశాడు. ఆవు మెడకు ఉన్న తాడు పత్తి కొయ్యకు చుట్టుకొని ప్రమాదవశాత్తుగా మృతి చెందినట్లు బాధితుడు వాపోయాడు. ఆవు విలువ దాదాపు రూ.80 వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

నక్ష బాటకు మోక్షం కలిగేనా ?

- అయ్యవారిపల్లి నుంచి పెనిమిళ్లకు రహదారిని ఏర్పాటు చేయాలి

- గుంతల్లో నడవడానికి ఇబ్బంది



అయ్యవారిపల్లి- పెనిమిళ్ల లింకు రోడ్డు

ఉప్పునుంతల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామం నుంచి పెనిమిళ్ల గ్రామానికి వెళ్లే నక్ష బాటను మట్టి రోడ్డుగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అయ్యవారిపల్లి నుంచి పెనిమిళ్లకు ఐదు కిలోమీటర్ల నక్షబాట నరకప్రాయంగా మారిందని, ఈ రహదారిపై ప్రయాణం చేయలేక డిండిహైవే నుంచి లత్తీపూర్, గువ్వలోనిపల్లి మీదుగా పెనిమిళ్లకు వెళ్లే దాదాపు 10 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే బాట మొత్తం గుంతలు ఏర్పడి నడవడానికికూడా వీల్లేకుండా ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామాల లింకు రోడ్డు బాగు చేస్తే పెనిమిళ్ల, పూర్యానాయక్ తండా, సీబీతం డా గ్రామాలకు దాదాపు 5 కిలో మీటర్ల దూరం తగ్గి ఆయా గ్రామాల ప్రజలకు మండల కేంద్రమైన అచ్చంపేట పట్టణానికి రాకపోకలకు వీలుగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల గ్రామాల లింకు రోడ్డు బాగు చేసే విధంగా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

> **నక్షబాటను మట్టి రోడ్డుగా చేయాలి**
>
> నక్ష బాటను మట్టి రోడ్డుగా బాగు చేస్తే అయ్యవారిపల్లి నుంచి పెనిమిళ్ళకు పెనిమిళ్ల నుంచి డిండి హైవే రోడ్డుకు రావడానికి సులువుగా ఉంటుంది. ఈ లింకు రోడ్డు బాగు చేస్తే దాదాపు కిలో మీటర్ల దూరం తగ్గి నాలుగైదు గ్రామాలకు రాకపోకలకు బాగుంటుంది.
>
> **- యాదిరెడ్డి, అయ్యవారిపల్లి**

సీఎం సభను జయప్రదం చేయాలి

- రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కశిరెడ్డి



మాట్లాడుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కల్వకుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30న మహబూబ్‌నగర్ సమీపాన ఉన్న జమిస్తాపూర్‌లో నిర్వహించే రైతు పండగ, సీఎం సభను విజయవంతం చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. రైతులను రాజులను చేయడమే సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్వకుర్తి ప్రాంత వాసి సీఎం రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అహర్నిషలు పని చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రైతు పండుగలో శాస్త్రవేత్తలచే రైతులకు వ్యవసాయంపై మరింత మెళకువలు చెప్పిస్తున్నట్లు తెలిపారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ తమపై చేస్తున్న విమర్శలను మానుకోవాలని ఎమ్మెల్యే హితవు పలికారు. విలేకర్ల సమావేశంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, వెల్దండ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి, నాయకులు విజయ్ కుమార్‌రెడ్డి, జగన్, శ్రీకాంత్‌రెడ్డి, సంజీవ్ యాదవ్, శ్రీకాంత్, హనుమానాయక్, రాంరెడ్డి, రాజశేఖర్, కౌన్సిలర్లు ఎజాజ్, శేఖర్, రవి, బాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే

వెల్దండ : రాష్ట్రంలోని నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని పెద్దాపూర్‌కు చెందిన వరికుప్పల మంగమ్మకు మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును గురువారం బాధిత కుటుంబీకులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణ, నాయకులు ఆంజనేయులు, అనిల్‌కుమార్, కొండల్, శ్రీనినాయక్ తదితరులు ఉన్నారు.

బహుజనుల ఆశాజ్యోతి.. జ్యోతిబాపూలే

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మాజ్యోతిరావు పూలే వర్ధంతిని గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పూలే చిత్ర పటానికి ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో అంటరానితనం, విద్య, రైతు ఉద్యమాలను నిర్వహించి సామాజంలో మార్పునకు తన జీవితాంతం కృషి చేసిన మహోన్నతుడు పూలే అని కొనియాడారు. పూలే ఆయన సాధనకు ప్రతీ బహుజన బిడ్డ కృషి చేయాలని ఆయన పిలునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, నాయకులు పబ్బతి శ్రీనివాసులు, నిరంజన్ యాదవ్, గంగోజీ, మౌలానా, బాలస్వామిగౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

● కేవీపీఎస్, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసి పూలే చిత్ర పటానికి కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న ఆధ్వర్యంలో సంఘం నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

నల్లమల విద్యార్థులకు సంచార గ్రంథాలయం

- డీఎఫ్‌వో రోహిత్ గోపిడి



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

మన్ననూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంతంలోని వివిధ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే వివిధ రకాల పుస్తకాలను అందించేందుకు అబ్బూరి ఛాయాదేవి సంచార గ్రంథాలయ వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని డీఎఫ్‌వో రోహిత్ గోపిడి తెలిపారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు అటవీ శాఖ పర్యాటక వనమాలిక ఆవరణలో సంచార గ్రంథాలయ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో రామమూర్తి పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించాలని డీఎఫ్‌వో రోహిత్ గోపిడి అన్నారు. అపోలో హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను మన్ననూరు పీటీజీ గురుకులం క్రీడామైదానంలో గురువారం నిర్వహించారు. అర్‌జావా వారియర్స్ మన్ననూరు ప్రథమ, వాలీ లవర్స్ అమ్రాబాద్ ద్వితీయ, అమ్రాబాద్ జూనియర్స్ తృతీయ, పీటీజీ మన్ననూరు నాలుగో స్థానం సాధించారు. విజేతలకు నగదుతో పాటుగా ట్రోఫీలను డీఎఫ్‌వో అందజేశారు. వాలీబాల్ క్రీడాకారులందరికీ కిట్లను అపోలో ఫౌండేషన్ ద్వారా అందజేశారు. అపోలో హెల్త్ ఫౌండేషన్ సీఈఓ రాంబాబు, పీటీజీ ప్రిన్సిపల్ గోవర్ధన్, టోటల్ హెల్త్ ఏరియా సమన్వయకర్త జావేద్ పాల్గొన్నారు.

సుదీర్ఘ కాలం పని చేయడం సంతృప్తినిచ్చింది

- బదిలీపై వెళ్తున్న డీఈవో గోవిందరాజులు



గోవిందరాజులును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలం పాటు జిల్లాలో పని చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని బదిలీపై వెళ్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు అన్నారు. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది బదిలీపై వెళ్తున్న గోవిందరాజులుకు వీడ్కోలు పలికారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతీ వ్యక్తికి మెరుగైన విద్య అందినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏసీ రాజశేఖర్‌రావు, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, సుజాత, సెక్టోరియల్ అధికారులు వెంకటయ్య, షర్ఫుద్దీన్, నూరుద్దీన్, మురళీధర్‌రెడ్డి, శోభారాణి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, ఉపాధ్యాయ సంఘాల నాయకులురాంచందర్‌రావు, విజయ్‌కుమార్, రాజిరెడ్డి, మురళి, సురేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, నిరంజన్, ఎంఈవోలుభాస్కర్‌రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి, దానయ్య, రాజేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

దేశిటిక్యాల పాఠశాలకు బెంచీలు వితరణ

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాల ప్రాథమికోన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి దూరెడ్డి లక్ష్మారెడ్డి బెంచీలను వితరణ చేశారు. గురువారం ఎంఈవో భాస్కర్ సమక్షంలో వితరణ చేసిన 28 బెంచీలను పాఠశాలకు అప్పగించారు. దాత మాట్లాడుతూ తన తండ్రి జంగిరెడ్డి జ్ఞాపకార్థం బెంచీలను అందజేసినట్లు తెలిపారు.

గురుకులంలో ఘనంగా స్వయం పరిపాలన



మన్ననూరు సాంఘిక సంక్షేమ గురుకులంలో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థినులు

మన్ననూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మన్ననూరు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో స్వయం పాలనా దినోత్సవాన్ని విద్యార్థినులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. విద్యాశాఖ మంత్రిగా రీనా, గురుకులం సెక్రటరీగా సుహాసిని, జాయింట్ సెక్రటరీగా హర్షిత, కలెక్టర్‌గా ఉషారాణి, డిప్యూటీ కలెక్టర్లుగా వైష్ణవి, కావేరి, అడిషనల్ సెక్రటరీగా అంజలి, డీఈవోగా జెస్సికా, ఎంఈవోగా అర్చన, ప్రిన్సిపాల్‌గా హేమలత, జోనల్ అధికారిగా అక్షితతో పాటు 80 మంది విద్యార్థినులు ఛాత్రోపాధాయ పాత్రను పోషించారు. అనంతరం ఉపాధ్యాయులుగా చక్కటి ప్రతిభ సాధించిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ రూపాదేవి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సరిత, పీడీ అస్మద్ బేగం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆలయంలో పూజలు చేసిన రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్



పూజలు చేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలోని అభయాంజనేయస్వామి, కాశీ విశాలాక్షి దేవాలయాలలో గురువారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల ప్రథమ వార్షికోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమాలకు శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భక్తిభావన పెంచుకున్నప్పుడే మానవ జీవితానికి సార్థకత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చిన్న వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనునాయక్, లక్ష్మిపతి, సురేష్, కృష్ణ, శేఖర్, శివ ఉన్నారు.

ఓటు వజ్రాయుధం

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశం సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజాసామ్యాన్ని పరిరక్షించే సరైన నాయకులను ఎన్నుకునేందుకు వజ్రాయుధం లాంటి ఓటు హక్కు ఎంతో విలువైనదని జిల్లా ఇంటర్ విద్యానోడల్ అధికారి జి.వెంకటరమణ అన్నారు. గురువారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఓటు అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వెంకటరమణ మాట్లాడుతూ వయస్సు 18 సంవత్సరాల నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఎంఈవో భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ తబిత, ఎంపీడీవో కోటేశ్వర్‌రావు, డీఆర్‌డీఏ అధికారులు అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- సగర సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సగరులు పోటీలో నిలిచి సామాజిక వర్గం సత్తా చాటాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు అన్నారు. గురువారం సగర సంఘం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్, బిజినేపల్లి మండలాల కమిటీలను ఎన్నుకున్నారు. నాగర్‌కర్నూల్ మండల అధ్యక్షుడిగా చిలుక పర్వతయ్య, బిజినేపల్లి మండల అధ్యక్షుడిగా రాజేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు బాలు, రాకేష్, సూరంపల్లి సుధాకర్, కొమ్ము వెంకటయ్య, సుధాకర్, బావిలాల లక్ష్మయ్య, అతినారపు వెంకటేష్, కొమ్ముల సత్యనారాయణ, అతినారపు బంగారయ్య , స్వామిసాగర్ పాల్గొన్నారు.

తాడూరులో అంగన్‌వాడీ కేంద్రానికి భూమి పూజ



ఉప్పునుంతల : అంగన్‌వాడీ కేంద్రానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఉప్పునుంతల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తాడురు గ్రామంలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రానికి అదేవిధంగా పల్లెదవాఖానకు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ భూమి పూజ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

వంగూరు : గ్రామాలబివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని ఉల్లంపల్లి, మిట్టసదగోడు గ్రామాలలో రూ.8 లక్షలతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ పక్కా భవనాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఉల్లంపల్లికి బీటీ రోడ్డు, మురికికాల్వల నిర్మాణాలకు అవసరమైన నిధులను సాధ్యమైనంత తొందరలోనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఉల్పర గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పాండురం గారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బక్కయ్య, తహసీల్దార్ మురళీమోహన్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నర్మద, సలేశ్వరం, రమేష్‌గౌడ్, జనార్దన్, వెంకట్‌రెడ్డి, క్యామ మల్లయ్య, చంద్రమౌళి, కృష్ణయ్య, ఐసీడీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలి

- ఉపాధి హామీ పనులపై డీఆర్‌డీవో ఓబులేష్



మేడిపూర్ నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో ఓబులేష్

తాడూరు/ వంగూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని గ్రామాల్లోని ఉపాధి పనులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణతో సిబ్బంది ముందుకెళ్లాలని డీఆర్‌డీవో ఓబులేష్ అన్నారు. గురువారం మండలంలోని గుంతకోడూరు, మేడిపూర్, ఆకునెల్లికుదురు గ్రామాల్లో నర్సరీలను, ఉపాధి పనుల కార్యాచరణను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రతీ నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేసుకుని విత్తనాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో చంద్ర సిద్దార్థ, సీటీఏ రాజేష్‌కుమార్, ఆయా గ్రామాల ఎఫ్ఏలు, నర్సరీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వంగూరు : వానాకాలం ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డీఆర్‌డీవో ఓబులేష్ అన్నారు. మండలంలో కొండారెడ్డిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఏగ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2,320, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2,300 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. సన్నాలకు రూ.500 బోనస్ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జివి, రమేష్, ఏపీఎం చంద్రయ్య, పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ పక్కాగా చేయాలి : ఆర్డీవో



మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో బన్సీలాల్

కోడేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డేటా ఎంట్రీ పక్కాగా చేయాలని కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో డేటా ఎంట్రీ కార్యక్రమాన్ని తహసీల్దార్ ఎంపీడీవోతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కుల గణన సర్వేను తప్పులు లేకుండా చేయాలని సలహాలు, సూచనలు చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో పర్యవేక్షణలో డేటా ఎంట్రీ చేయాలన్నారు. అనంతరం తహసిల్దార్ విజయ్‌కుమార్, ఆర్ఐ సురేందర్, జుమలయ్య, వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో అక్రమాలు, మోసాలు జరగకుండా ఐకేపీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ భవనాలను వెంటనే పూర్తి చేయిస్తాం : పీఆర్ ఏఈ

కోడేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అసంపూర్తిగా మిగిలిపోయిన భవనాలను త్వరలోనే పూర్తి చేయిస్తామని పంచాయతీరాజ్ ఈఈ విజయ్, మోహన్‌నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న భవనాలను వారు కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈఈ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న మండల మహిళా సమాఖ్య భవనం, గ్రామ పంచాయతీ భవనం పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామని అన్నారు. అనంతరం కస్తూర్బా గాంధీ పాఠశాల, మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలతో ఒక్కో పాఠశాలకు డార్మెంటరీ భవనాలకు రూ. 10 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ మండల నాయకులు ఎస్కే బాబు, పోడేండ్ల సురేష్‌యాదవ్, మిద్దె రామకృష్ణ, ఆదిరాజు, చామంతి, రాజు, సొప్పరి పెద్దబాలపీరు, నల్లవెల్లి ధర్మయ్య ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలి

- అదనపు కలెక్టర్ సీతారామారావు



జేపీనగర్ గురుకులంలో ఆహారం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, ఆర్డీవో ఎస్.శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీం

కల్వకుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ కే.సీతారామారావు ఆదేశించారు. నాణ్యమైన భోజనాలు పరిశుభ్రమైన వాతావరణం ఉండాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణ పరిధిలోని జేపీ నగర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకులాన్ని గురువారం ఆర్డీవో ఎస్.శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీంతో కలిసి అడిషనల్ కలెక్టర్ సీతారామారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలోని పరిసరాలను, విద్యార్థుకు వండిన భోజనాలను, ఆహార వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. డైనింగ్‌హాల్ సమీపంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గురుకులంలో వసతులు సమకూర్చాలన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

వెల్దండ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో చంద్రుడు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని బర్కత్‌పల్లి, చొక్కన్నపల్లి, చెర్కూర్ ప్రాథమిక పాఠశాలలను చంద్రుడు అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎం రవీందర్, కేజీబీవీ ఎస్‌వో శ్రవంతి ఉన్నారు.

భోజనంలో నాణ్యత పాటించకుంటే చర్యలు

బల్మూరు : విద్యార్థినులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రాఘవులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. భోజనం విషయమై వార్డెన్ కుర్వమ్మకు సూచనలు చేస్తూ పరిసరాల ప్రాంతాలను శుభ్రపర్చుకోవాలని సూచించారు.

'డబుల్ బెడ్ రూం ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వాలి'

కల్వకుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందించాలని లబ్ధిదారులతో కలిసి సీపీఎం నాయకులు కోరుతూ అడిషనల్ కలెక్టర్ కే.సీతారామారావుకు వినతి పత్రం అందజేశారు. కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయంలో ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో డబుల్‌బెడ్రూం లబ్ధిదారుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు నరసింహ, కోశాధికారి శ్రీనివాసులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జన వాల్ పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

కల్వకుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబరు 1న నిర్వహించే మాలల సింహగర్జన వాల్‌పోస్టర్‌ను గురువారం కల్వకుర్తిలో విడుదల చేశారు. మాలమహానాడు నాగర్ కర్నూల్ పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ చెన్నయ్య మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సభకు పెద్ద ఎత్తున హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు సుధాకర్, శివశంకర్, రాంపర్వతాలు, చెన్నకేశవులు, శేఖర్, చంద్రశేఖర్, రవి, నరేందర్, రాము, శ్రీనివాసులు, కుమార్, స్వామినాథ్, మల్లేష్, మురళి పాల్గొన్నారు.